# కోకిల

**-శిరంశెట్టి కాంతారావు**

ఆ రోజు శ్రావణ శుక్రవారం కావడంతో దొడ్లో తులసి కోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది చక్రమ్మ. ప్రదక్షణా లైతే చేస్తుందిగాని పూజలో గురి కుదరక అసహనంగా తడవకోసారి బాదం చెట్టువైపు చూస్తూంది.

ఆ చెట్టు మీదున్న కాకొకటి "కాఁవ్; కాఁవ్"మని అరుస్తూ పక్కనే ఉన్న పిల్లను గట్టిగా పొడిచింది. దాంతో పిల్లకాకి కూడా పెద్దగా నోరు తెరిచి "క్రీంచ్, క్రీంచ్" మని అరుస్తూ, ఎగరలేక, ఎగరలేక ఎగురుచూ చక్రమ్మ పక్క నుండే వెళ్ళి ఎర్రగన్నేరు చెట్టుమీద వాలింది. వెంటనే పెద్దకాకి కూడా 'రయ్యి'మంటూ వచ్చి గన్నేరు చెట్టు మీద వాలి మళ్ళీ పిల్లకాకిని పొడిచింది. పొద్దుట్నుండి ఇదేవరస, ఒకటే గోల.

చేస్తున్న ప్రదక్షిణాలు ఆపి, గన్నేరు చెట్టు మీద కాకుల వైపు కొర, కొర చూస్తూ 'టప, టప'మని తప్పట్లు కొడుతూ చేతులు రెండు చెట్టువైపు ఝాడించింది చక్రమ్మ. దాంతో ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా ఉన్న కాకులు మళ్ళీ అంతలోనే గోలకు దిగాయి.

ఇలా లాభం లేదనుకున్న చక్రమ్మ చీర చెంగును బొడ్లో దోపుకుని "ఉస్సో.. ఉస్సో..." అంటూ గబగబా గన్నేరు చెట్టువైపు నడిచింది.

చక్రమ్మ అలికిడి విన్న పెద్దకాకి 'సయ్యి'మని బాదం చెట్టు మీదికెగిరిపొయ్యి అక్కణ్ణుంచి అరవసాగింది. పిల్లకాకి కూడా అతి కష్టంమీద పక్కనే ఉన్న బాత్రూం గోడ మీదికెగిరి కూర్చుని బాధగా అరవసాగింది.

"ఈ కాకులు చావ, స్థిమితంగా పూజ కూడా చేసుకోనివ్వడంలేదు" అనుకుంటూ పూజా సామానంతా సర్దుకోసాగింది చక్రమ్మ.

"ఏమిటే! దొడ్లో చేరి నీలో నువ్వే ఏదో గొణుక్కుంటున్నావూ. ఇంతకూ పూజ చేసుకుంటున్నావా? లేక పోతే ఎవరినన్నా ఆడిపోసుకుంటున్నావా?" అంటూ చేతిలోని పేపర్‌తోనే తులసికోట దగ్గరకొచ్చాడు చక్రమ్మ భర్త వర్ధనరావు.

"పూజా! నా శ్రాద్ధమా! ముదనష్టపు కాకులు ఒకటే గోల. అదేం రోగమో, ఆ పాడుకాకి దాని పిల్లనదే పొడిచి, పొడిచి చంపుతుంది" చక్రమ్మ అంటుండగానే బాదం చెట్టుమీది కాకి పెద్దగా అరుస్తూ వచ్చి బాత్రూం గోడ మీదున్న పిల్లను ఒక్క తాపు తాకింది. అంతే, పిల్లకాకి గోల గోలగా అరుస్తూ నేలమీద పడి కొట్టుకో సాగింది. నేల మీద పడ్డ పిల్లను దగ్గరకెళ్ళి చూసిన వర్ధనరావు "ఓహోఁ ఇదా సంగతి!" అన్నాడు ఏదో అర్థమైనట్టు తలాడిస్తూ...

"ఏంటి? ఏదో అర్థమైనట్టు తలాడిస్తూ సంగతి, గింగతి అంటున్నారు" అంది చక్రమ్మ.

"ఇది కాకి పిల్ల కాదే పిచ్చిమొహమా!"

"మరి!!?"

"కోకిల పిల్ల"

"అలాగా! అనుకుంటుంటే వింటమేగాని ఎప్పుడూ చూళ్ళే" అంటూ ఆశ్చర్యంగా తొంగిచూస్తూ... పూజా సామాన్లు తీసుకొని ఇంట్లోకి నడిచింది చక్రమ్మ. ఆమె వెనుకే తనూ లోపలికెళ్ళాడు వర్ధనరావు.

వర్ధనరావు పవర్‌హౌజ్‌లో పర్సనల్ డిపార్టుమెంట్‌లో ఎపిఓగా చేసి పోయిన నెలలోనే రిటైర్ అయ్యాడు. ఏ విషయంలోనైనా భార్య "తానా" అంటే తాను "తందానా" అంటాడు. అతను భార్య మాటకు ఎదురు చెప్పగా చూసిన వాళ్ళెవరూ ఇంతవరకు లేరు.

చక్రమ్మ పేరుకు తగ్గట్టు ఇంట్లో చక్రమంతా తనే తిప్పుద్ది. ఇంట్లో తన మాటకు ఎదురు లేకుండా ఉండేందుకు చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. కుటుంబంలో ఏ విషయంలోనైనా ఫైనల్ డెసిషన్ ఆమెదే. తేడా వచ్చిందో భూకంపాన్నే సృష్టిస్తుంది.

వర్ధనరావు, చక్రమ్మ దంపతులకు ఓ కూతురు, ఓ కొడుకూ ఉన్నారు.

కూతురు పెద్దది. అల్లుడు మణుగూరు హెవీ వాటర్‌లో జాబ్ చేస్తున్నాడు. వాళ్ళకు ఇద్దరమ్మాయిలు.

కొడుకు చక్రపాణి. పాల్వంచ ఎస్.బి.హెచ్.లో క్యాషియర్‌గా చేస్తున్నాడు. అతనికి పెళ్ళై రెండేళ్లయింది. తండ్రిలాగే తల్లి మాటకు ఎదురు చెప్పలేడు.

కోడలు ఝాన్సీ. బిఎస్‌సి బిఇడి చేసి, డిఎస్‌సి కోసం ఎదురు చూస్తుంది.

ఝాన్సీ వాళ్ళ నాన్న కొత్తగూడెం సింగరేణిలో అకౌంటెంట్‌గా చేసి రిటైర్ అవుతున్న సందర్భంగా జరుగుతున్న సన్మానానికి రమ్మని ఫోన్ చేస్తే కొడుకుని,

కోడల్నీ పంపించి తాము మాత్రం ఇంట్లోనే ఉండి పొయ్యారు చక్రమ్మా, వర్ధనరావులు.

ఇంట్లోకొచ్చిన వర్ధనరావు నిన్నటి ఆదివారం అనుబంధంలో ఫజిల్ పూర్తిచేస్తూ కూర్చున్నాడు.

చక్రమ్మ, కాకరకాయలు, కత్తిపీట ముందేసుకుని భర్త పక్కనే కూర్చుంటూ నాలుగు టమాటాలేసి కూరొం డనా? లేకపోతే పులుసుపెట్టనా?" అంటూ అడుగుతుం డగానే "డగ్... డగ్... డగ్..." మంటూ ఆటో వచ్చి వాకిట్లో ఆగింది.

"చూడండీ! అబ్బాయి, కోడలూ వచ్చారేమో" అంది చక్రమ్మ.

"ఉండవే! నువ్వొకదానివి. వాకిట్లో కొచ్చిన వాళ్ళు ఇంట్లోకి రారా ఏంటి!?" అంటూ ఫజిల్లో సరైన పదం దొరక్క ఆలోచనలో మునిగిపొయ్యాడు వర్ధనరావు.

అంతలో నిజంగానే కొడుకూ, కోడలు ఇంట్లోకి రానే వచ్చారు.

"హుంస్స్"మంటు కుర్చీలో కూర్చుని 'షూస్' విప్పు కోసాగాడు చక్రపాణి.

భుజానికున్న హ్యాండ్ బ్యాగ్ హ్యాంగర్‌కి తగిలించి దొడ్లోకెళ్ళింది ఝాన్సీ. అంతలో బాదంచెట్టు మీది కాకి, మళ్ళోసారి గట్టిగా పిల్లను పొడిచింది. పిల్ల బాధగా అరుస్తుంటే కాళ్ళు కడుక్కుంటు అదంతా చూసిన ఝాన్సీ "ఏంటిది! దాని పిల్లనదే పొడుస్తుంది?' అను కుంటూ వంగి పక్కనే ఉన్న చిన్న రాయిని తీసుకుని "ఉస్స్‌స్... " మంటు కాకి మీదికి విసిరింది.

"ఏం గొడతావులేరా! పొద్దట్నుండి అదేగోల" కాకరకాయ తొడిమలను దొడ్లోని చెత్త బుట్టలో పడేస్తూ అంది చక్రమ్మ కోడలితో.

"ఎందుకలా? అది దాని పిల్లకాదా?"

"దాని పిల్లకాదు, పొడుకాదు, కోకిల పిల్ల"

".......!!? ఎంత దాని పిల్ల కాకపోయినా అన్ని రోజులు పొదిగి జన్మనిచ్చిన ప్రేమకూడా లేకుండ ఎలా పొడుస్తుంది పాపం. అనుకుంటూ కోకిల పిల్ల వైపు జాలిగా చూస్తూ అత్తతో బాటు ఇంట్లోకి నడిచింది ఝాన్సీ.

○ ○ ○

ఉదయం తొమ్మిది గంటలు...

దొడ్లో బాయి దగ్గర బట్టలు ఉతుకు, ఉతుకుతూనే "కళ్ళు తిరుగుతున్నాయని" వచ్చి గదిలో మంచం మీద ముడుచుకుని పడుకుంది ఝాన్సీ.

"ఆ మాత్రం పనికే కళ్ళు తిరుగుతున్నాయని వచ్చి పడుకుంటే ఇక సంసారం సట్టుబండలైనట్టే" అంటూ కోడలు మీద రుసరుసలాడుతూ పప్పుచారులోకి ముల క్కాయలు కొయ్యసాగింది చక్రమ్మ.

"ఈవిడగారి మాటలు పడేదానికన్నా, ఎలాగోలా ఆ నాలుగు బట్టలూ జాడించి వస్తే పీడా పోతుంది" అంటుకోడలు మీద రుస, రుస లాడుతు పప్పుచారు లోకి ములక్కాయలు కొయ్యసాగింది చక్రమ్మ.

"ఈవిడగారి మాటలు పడేదానికన్నా, ఎలాగోలా ఆ నాలుగు బట్టలూ జాడించి వస్తే పీడా పోతుంది" అనుకుంటు ఓపిక తెచ్చుకుని లేచి నిల్చుందో లేదో 'బొళ్ళు, బొళ్ళు' మంటు వాంతి చేసుకుంది ఝాన్సీ.

"సరిపాయె, సంబరం బాగానే ఉంది. పొద్దున్నే ఇల్లంతా ఖరాబయ్యింది. ఆ గదిలో చేరి అర్ధరాత్రి దాకా అడ్డమైన సీరియల్లు చూస్తూ నిద్రపోకపోతే ఇలాగే ఉంటుంది మరి? అలా దొడ్లోకెళ్ళి పుక్కిలించి, కళ్ళూ ముఖం కడుక్కోపో" అంటు కోడలు మీద విసుక్కుం టూనే చీపురు కట్ట, బకెట్టు అందుకుంది చక్రమ్మ.

కొడుక్కి టిఫిన్ పెడుతు "ఒరేయ్ చక్రం! నువ్వు బ్యాంక్‌కి వెళ్తూ, వెళ్తూ ఆవిడగార్ని ఆస్పత్రిలో కాస్త చూపించి పంపు" అంది చక్రమ్మ.

"తను చూపించుకుని వస్తానంటే, హాస్పటల్ దగ్గర దించి వెళతాను" అన్నాడు చక్రపాణి.

షేవింగ్ చేసుకుంటు తల్లీ, కొడుకుల మాటలు విన్న వర్ధనరావు "అదేంట్రా! ఒక్కతే ఎలా వస్తుంది! అసలే కళ్ళు తిరుగుతున్నాయంటు, వాంతులు చేసు కుంటుంటే" అన్నాడు.

"ఔతల, నేను బ్యాంక్‌కెళ్ళొద్దా మరి!" విసుగ్గా అన్నాడు చక్రపాణి.

"ఆయనకేంరా! మారాజు, ఇటు పుల్లదీసి అటు పెట్టడుగాని మాటలు మాత్రం ఎన్నైనా చెబుతాడు. పోనీ, నేనన్నా వద్దామంటే ఎక్కడి పని అక్కడే చచ్చింది" భర్త వైపు అదోరకంగా చూస్తూ అంది చక్రమ్మ.

"ఐనా, మధ్యలో నాకెందుకొచ్చిన గొడవలేద్దూ, మీ ఏడుపేదో మీరేడవండి" అంటూ షేవింగ్ చేసిన ముఖాన్ని 'డెట్టాల్'తో అద్దుకోసాగాడు వర్ధనరావు.

"ఈ గోలంతా ఎందుకు? నువ్వే ఆటోలో తీసుకెళ్ళి చూపించుకురారాదు" టిఫిన్ చేసిన ప్లేట్లోనే చెయ్యి కడుక్కుంటూ తండ్రితో అన్నాడు చక్రపాణి.

"అలాగే వెళ్ళొస్తాలే"

"హాస్పిటల్‌కొద్దు, ఏమొద్దు. రాత్రి సరిగా నిద్రపట్టక అన్నం అరగలేదంతే. ఈ పూట ఏమీ తినకుండా ఉంటే

అదే సర్దుకుంటుంది" గోడకేసి చూస్తూ అంది ఝాన్సీ.

"ఎందుకమ్మా! వెళ్ళి చూపించుకో తల్లీ! రోజులసలే బాగోలేవు. అన్నీ మాయరోగాలొస్తున్నాయ్" అంది కోడలివైపు నర్మగర్భంగా చూస్తూ చక్రమ్మ.

"అబ్బా! హాస్పటలకి వెళ్ళి రావడానికి ఇంత స్టోరీనా!" డ్రస్ వేసుకుంటూ అన్నాడు చక్రపాణి.

○ ○ ○

"ఇదుగో ఈ మందులు వాడి, మళ్ళీ ఓ వారం తరువాత తీసుకురండి. ఇంకోసారి చెక్ చేసి కన్‌ఫర్మ్ చేద్దాం" అంటూ ప్రిస్క్రిప్షన్ వర్ధనరావుకి అందించింది లేడీ డాక్టర్.

"అలాగే డాక్టర్!" అంటూ కోడలితో సహా బైటికి నడిచాడు వర్ధనరావు.

వారం తరువాత మళ్ళీ హాస్పటల్‌కి వెళ్ళి చెక్ చేయించుకున్న ఝాన్సీకి "ప్రెగ్నెన్సీ" అని కన్‌ఫర్మ్ చేసింది డాక్టర్.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలైన తరువాత పక్క మీద విశ్రాంతి తీసుకుంటూ "మళ్ళీ మనింట్లోకి చిన్న పిల్లలొస్తున్నారన్నమాట" అన్నాడు వర్ధనరావు భార్యతో.

"వస్తున్నారు సరే; ఆ వచ్చేది ఆడో, మొగో"

"ఎవరైతే ఏంటే!? ఈ రోజుల్లో ఎవరైనా ఒకటే"

"ఈ రోజులేంటి? ఆ రోజులేంటి? ఏ రోజుల్లోనైనా ఆడపిల్ల ఆడపిల్లే. మగపిల్ల వాళ్ళతో సమానంగా ఖర్చు పెట్టి చదివించాలి. పైగా మళ్ళీ లక్షల కట్నాలిచ్చి పెళ్ళి చెయ్యాలి. అంత చేసినా ఆ వచ్చిన వాడెలాంటి వాడో ఆ దేవుడికిక్కూడా తెలియదు. అసలీ గొడవంతా ఎందుకు? మొదట్లోనే చెక్ చేయించి చూసుకుంటే పోలే. ఆడపిల్లే అని తేలిందనుకో మొదట్లోనే తీసిపారేయిద్దాం"

"కోడలేమంటుందో?"

"దాని మొహం, అదేమంటుంది!?"

"అదేమంటుందేమిటి? చెక్ చేయించుకునేది తనా? నువ్వా?"

"ఒర్నీ అనుమానం పాడుగాను, ఉండిప్పుడే పిలుస్తా" అంటూ వంటగదివైపు తిరిగి "ఝాన్సీ" అంటూ పిల్చింది చక్రమ్మ.

"ఆఁ వస్తున్నా" అంటు సాయంత్రం టిఫిన్‌కి పకోడి పిండి పిసుకుతున్న చేత్తోనే వచ్చి "ఏంటి?" అన్నట్టు అత్తగారి మంచం పక్కనే ఆగింది ఝాన్సీ.

"ఆఁ ఏంలేదు. మనం సాయంత్రమోసారి హాస్పటల్‌కెళ్ళొద్దాం" అంది చక్రమ్మ.

"పొద్దున్నే గదా వెళ్ళొచ్చింది! మళ్ళీ వారం తర్వాత రమ్మన్నారు.

"సర్లే! ఎందుకైనా మంచిది, లేటైతే నీకే ఇబ్బందని"

"నాకేమిచ్చింది!?" అర్థంకానట్టు అత్తగారి ముఖంలోకి చూస్తూ అడిగింది ఝాన్సీ.

"అలా చూస్తావేంటి? స్కానింగ్ తీయిద్దామని"

"స్కానింగా?!"

"ఔను"

"నాకే స్కానింగ్‌లూ వద్దు. నేనేం తీయించుకోను"

"అది కాదమ్మా! మీ అత్తయ్య నీదేంటంటే, మగ పిల్లాడైతే ఫర్వాలేదు. ఆడపిల్లైతే-" అంటూ నీళ్ళు నములుతూ ఆగిపొయ్యాడు వర్ధనరావు.

"ఆఁ లేకపోతే... ఆగిపొయ్యారేం?" రెట్టించింది ఝాన్సీ.

"ఇంక చెప్పేదేంటి? ఆడపిల్లైతే అబార్షన్ చేయిద్దాం" తేల్చి చెప్పింది చక్రమ్మ.

"అంతా మీ ఇష్టమేనా?" అంది ఝాన్సీ.

"పెద్దవాళ్ళం చెబుతున్నాం. దాన్లో ఇష్టం, గిష్టం ఏముంది?" బదులిచ్చింది చక్రమ్మ.

"పెద్దాళ్ళలా మాట్లాడుతున్నారా మీరు! ఆడపిల్లైతే అబార్షన్ అంటున్నారు కదా!? మరి మీ కూతురుకి, ఇద్దరూ ఆడపిల్లలే కదా! ఆమెకెందుకు చేయించలేదు? కూతురుకో న్యాయం, కోడలికో న్యాయమా!? ఐనా, నాకు తెలియకడుగుతా! మీరూ ఆడవాళ్ళే కదా? ఇలా మాట్లాడ్డానికి మీకు సిగ్గనిపించడంలేదా?" కోపంగా అడిగింది ఝాన్సీ.

"ఏంటే!!? సిగ్గూ, గిగ్గూ అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావ్. నన్నూ, నా కూతుర్నీ అనేంతదాని వయ్యావా? ఏంజూసుకొని అంత పొగరుగా మాట్లాడుతున్నావ్! నువ్ గింజుకు చచ్చినా స్కానింగ్ తీయించాల్సిందే" ఊడిపోయిన జుట్టును ముడేసుకుంటూ అంది చక్రమ్మ.

అంతలో ఇంటి ముందు స్కూటర్ ఆగిన చప్పుడు కావడంతో ముగ్గురూ సైలెంటైపొయ్యారు.

"ఏంటది!? అందరూ అదోరకంగా ఉన్నారు? విషయమేంటి?" అప్పుడే ఇంట్లోకొచ్చి హెల్మెట్ టేబుల్ మీద పెడుతూ అడిగాడు చక్రపాణి.

"ఏం లేదురా! అత్తా కోడళ్ళేదో అనుకున్నారు" కొడుకుతో అన్నాడు వర్ధనరావు.

"ఏ విషయం మీద" తల్లీ, పెళ్ళాలకేసి చూస్తూ అడిగాడు చక్రపాణి.

"ఏంటలా!? బెల్లంగొట్టిన రాళ్ళలా ఏం మాట్లాడ

రేం?" భార్యనుద్దేశించి చూస్తూ అన్నాడు ఎవరూ మాట్లాడకపోవడంతో.

"ఆవిణ్ణే అడగండి, నాకేసి చూస్తారేంటి?" అంది ఝాన్సీ.

"బ్యాంక్ నుండి వచ్చానో లేదో, ఏంటమ్మా! ఈ గోలంతా? నువ్వన్నా చెప్పరాదు" తల్లిని అడిగాడు.

"ఏం జెప్పాలి? నా ఖర్మిలా కాలింది. ఒక్కగానొక్క కొడుక్కి ఏ కష్టం రాకూడదని మంచి మాట చెబితే నన్నూ, నా బిడ్డనూ ఎన్నెన్ని మాటలంది!! నీ అలుసు చూసుకొనే అదలా మాట్లాడుతుంది" అంటూ మెరుపు లేని ఉరుములా కొడుకు మీదికి లేచింది చక్రమ్మ.

"అసలు విషయం చెప్పకుండా ఎందుకిలా వేపుకు తింటారు" బిక్కచచ్చిపోతూ అన్నాడు చక్రపాణి.

అప్పటిదాకా మునిలా కూర్చున్న వర్ధనరావు "ఏం లేదురా అబ్బాయ్" అంటూ జరిగిన విషయమంతా కొడుక్కి వివరించాడు.

"ఆమె కంటే తెలియదు, చదువుకున్న దానివి నీకైనా బుద్ధుండక్కర్లే?! ఏంటీగోలంతా ఇంట్లో భార్య మీద ఇంతెత్తున లేచాడు చక్రపాణి.

"చదువుకున్న దాన్ని కాబట్టే చెబుతున్నా, స్కానింగ్ లు – గీనింగ్‌లు ఏమొద్దని. పిల్లో, పిల్లాడో ఎవరైనా ఒకటేనని. అంతగ్గాకుంటే ఒక్కళ్ళతోనే ఆపరేషన్ చేయించుకుంటాలే" అంది ఝాన్సీ.

"ఒక్కళ్ళతోనే చేయించుకుంటుందటా... ఏ రోగ మో, రొస్టో వచ్చి ఆ ఒకళ్ళూ గుటుక్కుమంటే అప్పుడు ఏడుద్దురుగాని. ఇద్దర్ని కనాల్సిందే; అందులోనూ తొల్సూరు కాన్పు మగపిల్లాడు కావాల్సిందే" కోడలి మాటల్ని మొదటికంటా ఖండిస్తూ అంది చక్రమ్మ.

"అంతా మీ ఇష్టమే. మీ కంటికి నేనో మనిషిలా కన్పిస్తేగదా?" అని ఏడుస్తూ గదిలోకెళ్ళి మంచం మీద వాలిపోయింది ఝాన్సీ.

భార్య వెనుకే గదిలోకొచ్చి పక్కన కూర్చుంటూ "ఆవిడను గురించి నీకు తెల్సిందే కదా?! ఏదో చెబు తుంది అర్థం చేసుకోరాదు" బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు చక్రపాణి.

"అర్థం చేసుకోవాల్సిందెవరు? తనా? నేనా?" ఏడుస్తూనే అంది ఝాన్సీ.

"అరేయ్ చక్రం! నేనెందుకు చెబుతున్నానో తెలుసు కో. ఆడపిల్లల్ని కంటే ఎన్ని ఇబ్బందులుంటాయో నీకు తెలియదు. పెండ్లానికి నచ్చజెప్పుకుంటావో, కాళ్ళు పట్టుకుంటావో నీ ఇష్టం. స్కానింగ్ మాత్రం చేయించా ల్సిందే అంటు బూత్రూంకెళ్ళింది చక్రమ్మ.

తల్లి దొడ్లోకెళ్ళిం తర్వాత బైటికొచ్చిన చక్రపాణి "ఏంటి నాన్నా! ఇదంతా?" అన్నాడు తండ్రితో.

"ఇంతవరకు మీ అమ్మ మాటకు నేనే ఎదురు చెప్పలేదురా! అట్లాంటిది నీ భార్య ఎదురు తిరిగే సరికి తట్టుకోలేకపోతుంది. ఐనా, దాని మాటకు అప్పీల్ లేదురా, చెప్పినట్టు చెయ్యడమే" అంటూ కొడుక్కి హితో పదేశం చేశాడు వర్ధనరావు.

తండ్రి సలహా పాటిస్తూ భార్యనే ఎలాగోలా ఒప్పిం చాలని మళ్ళీ భార్య గదిలోకెళ్ళాడు చక్రపాణి.

"ఆడపిల్లో, మొగపిల్లాడో తెలకుండానే ఆమెతో ఎందుకీ గొడవ? ముందా స్కానింగేదో చేయించుకో, మగపిల్లాడే ఐతే గొడవేలేదు. ఒకవేళ ఆడపిల్లే ఐతే, అప్పుడు చూసుకుందాం" అంటూ ఏదోవిధంగా ఝాన్సీతోని స్కానింగ్‌కి ఒప్పించాడు చక్రపాణి.

○ ○ ○

లోపల ఝాన్సీకి స్కానింగ్ తీస్తుంటే, బైట ఎదురు చూస్తూ కూర్చున్నారు కుటుంబమంతా.

అరగంట తరువాత వాళ్ళను లోపలికి రమ్మంటూ పిలుపొచ్చింది. వాళ్ళు వేళ్ళేసరికి ఝాన్సీ ముఖం వాడి పొయ్యి, కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నట్టు కన్పిం చింది.

"ఏమండీ! మీ కోడలికి అమ్మాయి పుట్టబోతుంది" అంది డాక్టరమ్మ వచ్చిన వాళ్ళను ఎదురుగుండా కూర్చోండని సైగజేస్తూ...

"చూశారా!? నా అనుమానమే నిజమైంది" భర్త చెవిలో గుస,గుస లాడింది చక్రమ్మ.

చక్రపాణి భార్యవైపు ఇబ్బందిగా చూశాడు.

"ఇప్పుడేం చేస్తారు?" అన్నట్టు తనూ భర్తవైపు చూసింది ఝాన్సీ.

"డాక్టర్ గారూ! అబార్షన్ చేసెయ్యండి" తడుముకో కుండా అంది చక్రమ్మ.

"నేను చేయించుకోను డాక్టర్. నాకిష్టంలేదు" అంది ఝాన్సీ.

"ఇక్కడ, నీ ఇష్టమెవరూ అడగట్లే. ఆడపిల్లైతే వద్దని ముందే చెప్పాను" చక్రమ్మ.

"కనేది నేను, నాకే పిల్లైనా ఒకటే" ఝాన్సీ.

"ఏరా సన్నాసి! అలా దేభ్యం ముఖమేసుకుని చూస్తావేం!? మాట్లాడు" కొడుకును గద్దిస్తూ అంది చక్రమ్మ.

"ఝాన్సీ ఈ ఒక్కసారికి అమ్మ చెప్పినట్టుకానీ,

ఈసారి చూద్దాంగానీ" మెల్లగా అన్నాడు చక్రపాణి.

"మీరంతా తల్లకిందులైనా, నేను మాత్రం అబార్షన్ చేయించుకోను" తెగేసి చెప్పింది ఝాన్సీ.

"నీ పప్పులేం ఉడకవ్, ఆరు నూరైనా అబార్షన్ చేయించుకోవాల్సిందే" అతనూ అంతే మొండిగా మాట్లాడసాగింది చక్రమ్మ.

"అమ్మాయ్! అత్తయ్య చెబుతుందిగా వినూ..." అన్నాడు వర్ధనరావు చిన్నగా.

"ఏంటండీ! ఈ న్యూసెన్సంతా మా హాస్పిటల్లో. ఆ అమ్మాయి వద్దంటుంటే ఎందుకలా బలవంతం చేస్తారు? అసలీ టెస్ట్‌లిప్పుడు బ్యాన్ చేశారు తెలుసా? ఏదో తెల్సిన వాళ్ళు కదా అని చేసిపెడితే ఇలా కంపు చేస్తున్నారు. బైటికి తెలిసిందంటే గవర్నమెంట్ వాళ్ళతో తలనొప్పి. ఇంటికెళ్ళి తీరిగ్గా వాదించుకుందురు గాని, ముందా ఫీజ్ కట్టి వెళ్ళండి" అంటు తల్లీ కొడుకుల్ని చివాట్లేసి బైటికి పంపించింది డాక్టరమ్మ.

❍ ❍ ❍

"ఏంటొదినగారూ! మా అమ్మాయికేదో సీరియస్ అని ఫోన్ చేస్తే... హడావిడిగా పరుగెత్తుకొచ్చాం. భలే వారేనే" అంది ఝాన్సీ వాళ్ళమ్మ వియ్యపురాలితో.

"వారం రోజుల్నుండి శతపోరినా, మా మాట వింటంలే" అందుకే అలా చేయించాను.

"పోనీండి అక్కయ్యగారూ! ఏదో పిల్ల, తల్లీ పిల్లా క్షేమంగా ఉంటే చాలుగదా!" అన్నాడు ఝాన్సీ తండ్రి చక్రమ్మతో.

"మీరు భలేవారేనే, మీరేవో చెప్పి విప్పిస్తారని పిలిపిస్తే, మీరేంటలా మాట్లాడతారు? ఆడపిల్లల్ని కని మీరేం సుఖపడుతున్నారేం? చేతనైతే అబార్షన్‌కి ఒప్పిం చండి, లేకపోతే వచ్చిందార్నే వెళ్ళిపొండి" అంటూ వియ్యంకుణ్ణి గంజిలో ఈగలా తీసిపారేసింది చక్రమ్మ.

"మాకెందుకొదినా! ఇది మీ ఇంటి సంగతి, మీరే చూసుకొండి. మా అమ్మాయిని మీ చేతిలో పెట్టాం. మా బాధ్యత తీరిపోయింది. ఇంక ఇందులో మేం చెప్పేదేముంది. ఏదన్న ఉంటే ఇంత పురుడు పోసి పంపించే వాళ్ళమే గాని, అంతకు మించి మీ మాటకు ఎదురు చెప్పేదేంలేదు" అంది ఝాన్సీ వాళ్ళమ్మ అప్పటికే పురిటికొచ్చి ఇంట్లో ఉన్న చిన్న బిడ్డ కళ్ళల్లో కదలాడుతుంటే.

"అది కాదే..." అంటు ఏదో మాట్లాడబోతున్న భర్తను "మీరాగండి" అన్నట్టు చెయ్యి పట్టి గుంజింది ఝాన్సీ వాళ్ళ అమ్మ.

దాంతో ఇంకా రెచ్చిపోయిన చక్రమ్మ "ఓరేయ్ చక్రం! అబార్షన్ చేయించుకొని అదన్నా ఇంట్లో ఉండాలి. లేదూ... నేనన్నా బైటికెళ్ళాలి ఏదో ఒకటి తేల్చు" అంటు కొడుకు మీద వత్తిడి తెచ్చింది.

"ఝాన్సీ! మా వాళ్ళతో బాటు, మీ వాళ్ళు కూడా చెబుతున్నా విన్పించుకోవే?! వచ్చేసారికి నీ ఇష్టం అంటున్నాగా. చివరికి మా అమ్మ అన్నంత పనీ చేసి ఇంట్లోంచి వెళ్ళిపోతే నలుగురూ నవ్వుతారు తెలుసా?" చివరి ప్రయత్నంగా అడుగుతున్నట్టు అడిగాడు చక్రపాణి.

"పోతే పోనివ్వండి, నేనేం పొమ్మనడంలేదుగా" విసురుగా అంది ఝాన్సీ.

"ఏంటే... పోతే పోనివ్వాలా!?" అంటు కోపంతో పండ్లు కొరుకుతూ ఝాన్సీ చెంప మీద 'ఛెల్' మంటూ ఒక్కటిచ్చాడు చక్రపాణి.

"ఇంతకంటే ఇంకేం చెయ్యగలరు?" ఏడుస్తూ అంది ఝాన్సీ చెంప పట్టుకుంటు.

"ఇదుగో! ఆఖరిసారి చెబుతున్నా. చేయించుకుంటే అబార్షన్ చేయించుకుని ఇంట్లో ఉండు, లేకపోతే నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళు" కోపంతో ఊగిపోతూ అన్నాడు చక్రపాణి.

భర్త మాటలకు వేటగాడి బాణం దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడిన ఝాన్సీ "ఎక్కడికో వెళ్ళే ఖర్మ నాకేంటి? నా పుట్టిల్లులేకనా?" అంటు అప్పటిదాకా బొమ్మల్లా నిల్చున్న తల్లిదండ్రుల మధ్యకు నడిచింది.

"ఏం పుట్టింటివాళ్ళే? నీ ముఖం. అక్కడేం ఆస్తులు పుచ్చిపోతున్నాయనుకుంటున్నావా? పరిస్థితులు అర్థం చేసుకుని చెప్పినట్టు వినక ఏంటా పెంకితనం" అంది ఝాన్సీ తల్లి పక్కకు జరుగుతూ.

భర్త మాటలతోనే సగం చచ్చిపోయిన ఝాన్సీ, తల్లి మాటలతో పూర్తిగా చచ్చిపోయిన దానిలా ఐపో యింది.

"ఇంకా ఏంటి చూసేది? నడు హాస్పటల్‌కి" అంది చక్రమ్మ యుద్ధంలో జయించిన వీరునిలా. నవ్వుతూ...

"ఈ రోజుల్లో కూడా మీలాంటి అత్తమామలు, మొగుడూ ఇలాంటి తల్లిదండ్రులు ఉన్నారని ఇప్పుడే తెలుసుకున్నాను. మీలాంటి మనుషుల మధ్య రాజీపడి బతకడం కంటే, నేను చదువుకున్న చదువుని నమ్ము కుంటే నేనూ, నా పాప ఎక్కడోచోట హాయిగా బత గ్గలం" అంటూ బైటికి నడిచింది ఝాన్సీ. ■